

# భావోద్వేగ వ్యాఖ్యలపై ఈసీ సీరియస్

కౌశిక్‌రెడ్డిపై నివేదిక ఇవ్వాలంటూ ఎన్నికల అధికారికి ఆదేశం

6లో..


వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 139        బుధవారం | 29 నవంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




# అంతా సిద్ధం

## రేపే అసెంబ్లీ ఎన్నికలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత, 144 సెక్షన్
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామాగ్రి అందజేత
- ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం మాక్ పోలింగ్ .. తర్వాత సాధారణ పోలింగ్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అంతా సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలనుంచి గురువారం ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించాలని తదనంతరం ఉదయం 7 గంటలకు సాధారణ పోలింగ్ నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికలతోపాటు కౌంటింగ్ ముగిసే వరకు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్







వివరాలు 2లో..

# మహిళా 'మణు'లే..

ఉమ్మడి జిల్లాలో వారి సంఖ్యే ఎక్కువ

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 29,74,564 |
| పురుషులు | 14,68,845 |
| మహిళలు | 15,05,252 |





2లో

# స్వేచ్ఛగా ఓటేయాలి

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు సకల ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య

డబ్బులు ఇవ్వలేదని..

# మహిళల ఆందోళన

2లో



# అంతా సిద్ధం

## రేపే అసెంబ్లీ ఎన్నికలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత, 144 సెక్షన్
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామాగ్రి అందజేత
- ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం మాక్ పోలింగ్.. తర్వాత సాధారణ పోలింగ్







**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో జరుగనున్న పోలింగ్ కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో లక్షమంది రాష్ట్ర పోలీస్ సిబ్బందితోపాటు 375 కంపెనీల కేంద్ర బలగాలను కూడా రంగంలోకి దించారు. సమస్యాత్మక, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,400 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అదనంగా సిబ్బందిని నియమించారు. అస్సాం రైఫిల్స్, బోర్డర్స్ సెక్యూరిటీ ఫోర్స్,సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను బద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి హోంగార్డు సిబ్బంది వచ్చారు.

### భద్రత కట్టుదిట్టం..

కాగా ఇప్పటికే ఎన్నికలు బహిష్కరణకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. దీంతో ఏజన్సీ ప్రాంతాల్లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. కేంద్ర బాలగాలు ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. మద్యం, డబ్బులు పంపిణీపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

### వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్..

పోలింగ్‌కు సర్వం సన్నద్ధం కాగా పోలింగ్ సామాగ్రిని తీసుకుని అధికారులు తమకు కేటాయించిన కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. దీని కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడికే సిబ్బంది చేరుకొని తమకు కేటాయించిన సామగ్రిని కలెక్ట్ చేసుకుని బయలు దేరారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును ఫెసిలిటీ సెంటర్‌లో కూడా వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. అక్కడే ఎన్నికల సామగ్రి కలెక్ట్ చేసుకొని అక్కడి నుంచి ఏర్పాటు చేసిన వెహికల్స్‌లో పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని చేరవేసేందుకు ఉంచిన వాహనాలకు ముందే రూట్ మ్యాప్ ఇచ్చారు. ఆ ప్రకారమే వెహికల్స్ మూమెంట్ ఉంటుంది. వేరే దారిలో వెళ్లే పరిస్థితి ఉండకూడదు. మార్గ మధ్యలో ఆప కూడదని కూడా ఆదేశాలు ఉన్నాయి. వాటికి జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని ఏం జరుగుతుందో స్పష్టంగా తెలిసిపోతుందని ఏద్కెనా సమస్య ఉంటే వెంటనే అధికారులు అక్కడకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

### మాక్ పోలింగ్..

సాధారణ పోలింగ్ కు ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం ఐదున్నరకే మాక్ పోలింగ్ పూర్తి చేయాలని నిబంధనలు విధించారు. ఆట్కెంకు అభ్యర్థుల ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో ఉండాలని అధికారులు ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లు ఈవీఎంలను టచ్ చేయడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అందరి సమక్షంలో మాక్ పోలింగ్ జరిగిన తర్వాత ఉదయం ఏడు గంటలకు సాధారణ పోలింగ్ పక్రియ మొదలు కానుంది.

### నక్సల్ ప్రాంతాల్లో 4వరకే పోలింగ్..

గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 నక్సల్స్ ప్రభావిత నియోజకవర్గాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిస్తారు. మిగతా ప్రాంతాల్లో ఐదు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఐదు గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించనున్నారు.

### 35,655 పోలింగ్ కేంద్రాలు..

పోలింగ్ కోసం ఎన్నికల సంఘం ఈ సారి విస్తృత ఏర్పాట్లు చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వారు ఓటు వేసి వెళ్లేందుకు వీలుగా 21,686 వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. 80 ఏళ్లపై బడిన వారికి ఉచిత రవాణా సదుపాయం కూడా కల్పించారు. ఓటరు స్లిప్పులు, నమూనా బ్యాలెట్లు పంపిణీ చేయడం పూర్తయింది.

### 644 మోడల్ పోలింగ్ కేంద్రాలు..

దివ్యాంగుల కోసం బ్రెయిలీ లిపి ఉన్న ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 644 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో 120పైగా కేంద్రాలను దివ్యాంగులే నిర్వహించనున్నారు. మరో ఐదు వందల కేంద్రాలను మహిళలు నిర్వహించనున్నారు. ఓటరు స్లిప్‌లను మాత్రం గుర్తింపు కార్డుగా పరిగణలోకి తీసుకోమని..ఓటరు ఐడీ కానీ వేరే ఇతర 12 రకాల ఐడీలు కానీ ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటరు స్లిప్పులపై ఎలాంటి గుర్తులు ఉండటానికి వీల్లేదని చెప్పింది. అలాంటి వాటిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని లేకుంటే తిరస్కరిస్తామని పేర్కొంది.

### సెల్ ఫోన్లకు అనుమతి లేదు..

ఓటు వేసేందుకు వచ్చిన వాళ్లు ఎవరూ ఫోన్లు తీసుకురావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఓట్లు వేసినప్పుడు సెల్ఫీలు, ఇతర ఫొటోలు తీయడానికి కూడా వీల్లేదని చెబుతున్నారు. అలాంటి ప్రయత్నాలు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్షార్హులు అవుతారని హెచ్చరిస్తున్నారు.



### ఈవీఎంల తరలింపుపై గట్టి నిఘా

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తరలిస్తున్న ఈవీఎం, వీవీ ప్యాట్స్ పై అధికారులు గట్టి నిఘా పెట్టారు. పోలీస్ ఎస్కార్ట్ వాహనాలు ముందు సాగుతుండగా ఈవీఎంలతో సెక్టోరల్, పోలింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.షణ్మగ రాజన్ పోలింగ్ కేంద్రాలకు తరలింపును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరంగల్ తూర్పు ఎన్నికల అధికారి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వానా బాషా ఎన్నికల ప్రక్రియపై ఎస్.షణ్మగ రాజన్ కు వివరించారు.

# మహిళా ‘మణు’లే..

**ఉమ్మడి జిల్లాలో వారి సంఖ్యే ఎక్కువ**

**మొత్తం ఓటర్లు 29,74,564**

**పురుషులు 14,68,845, మహిళలు 15,05,252**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో ‘ఆమె’దే పైచేయిగా ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 29,74,564 ఓటర్లుండగా అందులో పురుషులకంటే 36,407మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అయితే గత కొంత కాలంగా ఓటు హక్కును వినియోగించుకునే వారు కూడా పురుషుల కంటే మహిళలే అధికంగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం పురుషుల ఓట్లు 14,68,845 ఉండగా, మహిళా ఓటర్లు 15,05,252 మంది ఉన్నారు. వీరే కాకుండా 476మంది థర్డ్ జెండర్లున్నారు.

### 12 నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు..

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | పురుషులు | మహిళలు | ఇతరులు |
|---|---|---|---|---|
| వరంగల్ తూర్పు | 2,54,641 | 1,24,493 | 1,29,810 | 338 |
| వరంగల్ పశ్చిమ | 2,86,688 | 1,41,666 | 1,45,009 | 13 |
| పరకాల | 2,21,436 | 1,08,280 | 1,13,154 | 2 |
| నర్సంపేట | 2,32,179 | 1,14,358 | 1,17,815 | 6 |
| పాలకుర్తి | 2,51,490 | 1,25,308 | 1,26,172 | 10 |
| స్టేషన్ ఘన్ పూర్ | 2,49,155 | 1,23,675 | 1,25,479 | 1 |
| జనగామ | 2,37,108 | 1,18,160 | 1,18,939 | 9 |
| వర్ధన్నపేట | 2,69,192 | 1,32,736 | 1,36,441 | 15 |
| భూపాలపల్లి | 2,73,633 | 1,35,887 | 1,37,741 | 5 |
| ములుగు | 2,26,366 | 1,11,153 | 1,15,190 | 23 |
| మహబూబాబాద్ | 2,53,342 | 1,24,849 | 1,28,456 | 37 |
| డోర్నకల్ | 2,19,264 | 1,08,280 | 1,11,046 | 8 |

## డబ్బులు ఇవ్వలేదని..

# మహిళల ఆందోళన

**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** తమకు డబ్బులు ఇవ్వడంలేదంటూ ములుగు జిల్లా ఏటూరునాగారంలో పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. బుధవారం 49వ బూత్ కు చెందిన వారికి ఒక పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు డబ్బులు పంచుతున్నారంటూ ప్రచారం సాగడంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఓటర్లు స్లిప్పులను పట్టుకొని వచ్చారు. దీంతో కొందరికి మాత్రమే డబ్బులు పంచి మరి కొందరికి ఇవ్వక పోవడంతో వారు ఆందోళనకు దిగారు. పార్టీ నుంచి వచ్చిన డబ్బులు పంచకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. మీ ఇంట్లోంచి ఇస్తున్నారా అంటూ డిమాండ్ చేశారు. అందరికీ ఇచ్చి మాకు మాత్రమే ఎందుకు ఇవ్వడం లేదంటూ తిరగబడ్డారు. ఓట్లు వేస్తాం కానీ.. రేపటి వరకైనా సరే మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలంటూ అల్టిమేటం జారీ చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## గోమాత పాద ముద్రికల ముగ్గులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని పెగడపల్లి డబ్బలా క్రాస్ వద్ద గల శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం మహిళలు గోమాత పాద ముద్రికల ముగ్గులు వేశారు. ఉదయమే పెద్ద ఎత్తున మహిళులు దేవాలయానికి వచ్చి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ కుంకుమేశ్వరాలయంలో మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ప్రసిద్ధ శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహా రుద్ర యాగ సహిత ఆకాశ దీపోత్సవ మహా అన్నదాన మహొత్సవాలు బ్రహ్మశ్రీ కోమాల్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున అత్యంత వైభవంగా నిర్వహించబడుచున్నవి. నిత్య అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పరకాలకు చెందిన గంట కళావతి –వెంకటేశ్వర్లు దంపతులచే మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అల్పాహార కార్యక్రమదాత ఇరుకుల్ల శ్రీలత –శ్రీధర్ దంపతులు స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, వంశానుగత అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య, భక్తులు పలువురు పాల్గొన్నారు.

## మత్స్యగిరి స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం ఉదయం హరిహరపుత్ర అయ్యప్ప స్వామికి పంచామృతాలతో దేవాలయ చైర్మన్ గురు స్వామి సామల భిక్షపతి అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప అష్టోత్తరాలతో శరణు ఘోషతో దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో గురు స్వాములు పసునూటి భిక్షపతి, సామల రవీందర్, దిడ్డి రమేష్, బొల్లపల్లి సదానందం, మార్త సుమన్, గోరంటల ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి, క్రాంతి, రాము, ప్రవీణ్, విశాల్, వంశీకృష్ణ, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అంబరీష్ బుధవారం హెల్త్ వెల్నెస్ సెంటర్ భూపతిపేట, పీ ఎస్ సీ అయోధ్య పురం, కొత్తగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ వెల్నెస్ సెంటర్ పోగుళ్లపల్లి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తగూడ, సెంటర్ వెల్ బల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గంగారం హెల్త్ వెల్ సెంటర్ బత్తులపల్లి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోమట్ల గూడెం, గంగారం, హెల్త్ సెంటర్లలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలను 12వారాలలో నమోదు చేయాలని, గర్భిణీ స్త్రీలు అందరికీ టీడీ వ్యాక్సిన్ ఇప్పించాలని, వ్యాధి నిరోధక టీకాలు, 100శాతం టార్గెట్ చేయాలని, అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, హైపర్ టెన్షన్, ప్రాథమిక స్థాయిలో గుర్తించి, చికిత్స అందించాలని అదేవిధంగా దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా చికెన్ గునియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులను , అరికట్టేందుకు, ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్షయ వ్యాధిని గుర్తించడానికి, తెమడ పరీక్ష చేయించుకోవాలని, దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, ముఖ్యంగా రక్తహీనత ఉన్న వాళ్లని గుర్తించి, ఐరన్ ఫోలిక్ టాబ్లెట్స్‌ను ఇప్పించాలని, ఆరోగ్య కార్యకర్తలకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మురళీధర్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎం రుక్మద్దీన్ పాల్గొన్నారు.



# పటిష్ట ప్రణాళికతో సజావుగా ఎన్నికలు

### పౌరులు ఓటు హక్కును వినియోగించుకోవాలి

### భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖారే




**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** పటిష్ట ప్రణాళికతో సజావుగా ఎన్నికలు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో పోలీసు బలగాల డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ వద్ద ఎస్పీ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతియుత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో సుమారు 2000మంది, ఛత్తీస్ గఢ్ హెూంగార్డులు, సీఆర్పీఎఫ్ జిల్లా పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా పరిధిలో భూపాలపల్లి, మంథని నియోజక వర్గాలు ఉన్నాయని అన్నారు. బందోబస్త్ లో భాగంగా ప్రత్యేక పెట్రోలింగ్, పార్టీలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ (క్యూఆర్టీ)/ స్ట్రయికింగ్ ఫోర్స్/ స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్/, 10సీఆర్పీ ఎఫ్ కంపెనీల కేంద్ర బలగాలను, జిల్లా పోలీసుల సేవలను వినియోగిస్తున్నామని, ఎలాంటి ఘటనలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికలు ముగిసేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 405పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఇందులో మావోయిస్ట్ ప్రభావిత పోలింగ్ స్టేషన్లు 76, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 102ఉన్నాయన్నారు. మావోయిస్ట్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రశాంత పోలింగ్ నిర్వహణ కోసం అదనపు పోలీసు బలగాలను మోహరించామని ఎస్పీ పేర్కొన్నారు. పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలలకు తరలిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా అంతర్ రాష్ట్ర, ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా చట్ట వ్యతిరేఖ చర్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన నియమాలను పక్కగా అమలు చేస్తూ, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠినంగా ఉన్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు జిలాల్లో ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసులు 18నమోదు కావడం జరిగిందని అన్నారు. జిల్లా ప్రజలు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు, పోలీసులకు సహకరిస్తూ ఎన్నికలను పండగగా జరపుకోవాలని, ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికల నియమావళి పాటిస్తూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు పంచరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడించారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం










## హనుమకొండ జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

## జిల్లాలో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలు


## ఈవీఎంల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్


**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో గురువారం జరగనున్న పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. వరంగల్ ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల ఈవీఎంల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే పోలింగ్ కు సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈవీఎంలతో పాటు ఇతర పోలింగ్ సామగ్రి తరలింపును కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ ఈవీఎంలు ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ విధులకు హాజరైన అధికారులు సిబ్బంది హాజరు వివరాలను జనరల్ అబ్జర్వర్ డాక్టర్ హెచ్. ఎన్. గోపాలకృష్ణ, పోలీస్ అబ్జర్వర్ తోగో కర్గా, కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అధికారులు సిబ్బందితో మాట్లాడారు. ఈవీఎంల డెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పోలింగ్ అధికారులు, అదనపు పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులకు కలెక్టర్ సలహాలు సూచనలు చేశారు. ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించే వాహనాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏనుమాములలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య సేవలను పరిశీలించారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బందికి భోజన సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు గురించి పోలీస్ అధికారులు సిబ్బందికి సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ భారీ పలు సూచనలు చేశారు. వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు ఎన్నికల సామగ్రితో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది వాహనాల ముందు జిల్లా జనరల్ అబ్జర్వర్ డాక్టర్ హెచ్. ఎన్ గోపాలకృష్ణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రిటర్నింగ్ అధికారులు రమేష్,శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. ఉన్నటువంటి ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు వచ్చే ఓటర్లకు తాగునీరు ర్యాంపు, తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా యువత ఓటు హక్కును వినియోగించుకునే విధంగా స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ పరకాల నియోజకవర్గాల్లో 484 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్, మీడియా కంట్రోల్ రూమ్, వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.







# పోలింగ్ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చర్యలు



## కేంద్ర ఎన్నికల పరిశీలకుడు షణ్ముగ రాజన్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకుడు షణ్ముగ రాజన్ అన్నారు. బుధవారం ఏనుమాముల మార్కెట్ యార్డ్ లో కొనసాగుతున్న డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు, ఆర్ఓ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఓ షేక్ రిజ్వాన్ బాషా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను గురించి తెలియజేస్తూ సాధారణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం పోలింగ్ నిర్వహించుటకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, గురువారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించు కోవచ్చునని, వరంగల్ (తూర్పు)నియోజక వర్గంలో మొత్తం 29మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని, ఓటింగ్ ప్రశాంతంగా జరుగుటకు పోలిటికల్ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. నియోజక వర్గంలో మొత్తం ఓట్లర్లు 2,54,641 మంది కలరని, అందులో పురుషులు 1,24,493, మహిళలు 1,29,810, ఉన్నారని తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డు గోదాం 11లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల లో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పంపిణీ ఏర్పాట్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. మొత్తం సెక్టార్ లు 21, అందులో 3 రిజర్వు అని, 17 రూట్లలో పోలింగ్ సిబ్బందితో పాటు ఈవీఎం, వీవీ ప్యాట్ లను సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పోలీసు భద్రతతో తరలించినట్లు పేర్కొన్నారు. 230 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్, 57క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లు, 110మంది మైక్రో అబ్జర్వర్ల్ ను అలాట్ చేయడం జరిగిందని, పోలింగ్ అధికారులు 264, సహాయ పోలింగ్ అధికారులు 264, అదనపు పోలింగ్ అధికారులు 528 ఉన్నారన్నారు. మొత్తం పోలింగ్ సిబ్బంది 1056 ఉన్నారని చెప్పారు. పోలింగ్ కు 575బ్యాలెట్ యూనిట్స్, 287కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్ లు 322లు వినియోగించడం జరుగుతుందన్నారు. నియోజక వర్గంలో 5చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను, 5 మహిళా పోలింగ్ కేంద్రాలు, 1 పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రం, 1యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసు చంద్ర, సెక్రెటరీ విజయ లక్ష్మి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఇక్బాల్, నాగేశ్వర్ రావుతో పాటు రెవిన్యూ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## జాతరలో వాటర్ బాటిళ్ల పంపిణీ




**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని తిరుమలగిరి గుట్టపైన వెలసిన శ్రీ బొగులోని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పరకాలలో నూతనంగా ఏర్పడిన ఉమాదేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా భక్తులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రాహుల్యా రెడ్డి, పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి భక్తులు రద్దీగా ఉన్న ప్రదేశంలో సమ్మక్క గద్దల వద్ద, పాండవుల గుట్ట పోయే దారిలో గుట్ట పైకి కాలినడకగా వెళ్లే భక్తులకు ఉచితంగా వాటర్ బాటిల్స్ అందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ గౌతం మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారంలో జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఉచితంగా క్యాంప్, అన్నదాన కార్యక్రమాలు ఉమాదేవి హాస్పటల్ తరపున ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ రమేష్ రెడ్డి, సురేష్ తదిరులు పాల్గొన్నారు.

## అభ్యర్థులకు మద్దతుగా రంగంలోకి స్పెషల్ టీమ్‌లు

వరంగల్ వాయిస్, వరంగల్ : అన్ని చెక్ పోస్టులు దాటి వరంగల్ నగరంలోకి డబ్బుల సంచులు చేరాయి. పలు వాహనాల్లో గుర్తు తెలియని వ్యక్తులు భారీ నగదును వరంగల్ నగరానికి తీసుకువచ్చినట్లు సమాచారం. ఆ వాహనాల్లో తెచ్చిన సంచుల్లో ఏమీ ఉన్నాయని అడిగితే వారు ఎందుకు హడావుడి చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. నగరంలోని 20వ డివిజన్లకు, 20సంచులు ప్యాక్ చేసినట్లు సమాచారం. ఆ బ్యాగుల్లో డబ్బులే ఉన్నాయని తెలుస్తోంది. పోచంమైదాన్ కేఆర్ గార్డెన్ దగ్గరల్లో ఈ సంచులు దిగుమతి చేసినట్లు చెబుతున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వచ్చేసరికి వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. ఒక్కొక్కటి ఒక్కో డివిజన్ కు చేరాయని, ఆ తర్వాత ఓటర్లకు చేర్చే బాధ్యత ఆయా పార్టీల కార్యకర్తల చేతిలో పెట్టారు. తూర్పు నియోజకవర్గంలోని పలు పార్టీల అభ్యర్థులకు మద్దతుగా స్పెషల్ టీమ్ రంగంలోకి దిగినట్లు సమాచారం. నగరంలోని హోటళ్లు, లాడ్జిలో స్థానికేతరులు ఇంకా ఉన్నారా అనే అనుమానం పలువురి నుంచి వ్యక్తమవుతోంది.



# పోలింగ్ స్టేషన్లకు చేరిన ఈవీఎం ప్యాడ్లు



**వరంగల్ వాయిస్, పరకాల :** రేపు జరిగే సాధారణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు గాను ఎన్నికల అధికారులు సిబ్బందితో ఈవీఎం ప్యాడ్లతో సిబ్బందికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బుధవారం వాహనాల ద్వారా పోలింగ్ సెంటర్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించుటకు గాను పోలింగ్ స్టేషన్‌లో పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టి పోలీస్ పహారాతో ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఎన్నికలు నిర్వహించేలా తగుచర్యలను చేపట్టారు. అదే విధంగా ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సౌకర్యాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి పోలింగ్ స్టేషన్ ఆవరణంలో మంచినీటి సౌకర్యంతో పాటు హెల్త్ సిబ్బందిని సైతం ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశానుసారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలను చేపడుతూ తగు సమాచారాన్ని అందజేయడంతోపాటు సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల పట్ల నిఘాను ఏర్పాటు చేసినట్లు పరకాల ఏసీపీ, సీఐ తెలిపారు.



# తెలంగాణ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ




## బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల గెలుపులపై బెట్టింగ్‌లు
### రంగంలోకి బుకీలు దిగినట్లు వార్తలు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ఎన్నికలపై బెట్టింగ్ గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి నెలకొంది. ఈసారి బీఆర్ఎస్ గెలుస్తుందా లేక..కాంగ్రెస్ గెలుస్తుందా అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రజలు ఎవరికి ఓటేస్తారన్న ఆసక్తి కూడా ఉంది. ఈ క్రమంలో పందాల రాయుళ్లు రంగంలోకి దిగారు. ఈ మేరకు బెట్టింగ్ దందా జోరుగా సాగుతోంది. ఇప్పటికే కోట్లల్లో దాందా సాగినట్లు సమాచారం. గురువారం సాయంత్రం విడుదలయ్యే ఎగ్జిట్ పోల్స్ తర్వాత ఫలితాలు వెలువడే డిసెంబర్ 3 వరకు బెట్టింగ్ దందా కోట్లు దాటినా ఆశ్చర్యం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నెల క్రితమే ఏపీలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ ఎన్నికలపై బెట్టింగులు సాగుతున్నాయని అప్పట్లో వార్తలు వినిపించాయి. హైదరాబాద్ లేదా తెలంగాణలో బెట్టింగ్ నిర్వహిస్తే పట్టుబడే అవకాశం ఉందని గుర్తించిన బుకీలు, ఇతర ప్రాంతాల నుంచి దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఏపీ, ముంబై, ఢిల్లీకి, కోల్‌కతతో పాటు దేశంలోని పలు ఇతర నగరాల నుంచి ఇది జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బుకీలు లండన్, అమెరికాల నుంచి యాప్‌ల ద్వారా బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలియ వచ్చింది. ముఖ్యంగా ఒక పార్టీ గెలుపుపై రెట్టింపు పందేలు జరుగుతున్నాయి. అంటే ఆ పార్టీపై రూ.లక్ష కాస్తే.. అవతలవాళ్లు రూ.2లక్షలు ఇవ్వాలన్నమాట. డిసెంబర్ 3న కౌంటింగ్ జరిగింతే వరకు బెట్టింగులు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో రాష్ట్ర పోలీసులు లక్షమంది సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను కూడా రంగంలోకి దించారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఎన్నికల విధుల్లో 375కంపెనీల కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,400 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అదనంగా సిబ్బందిని నియమించారు. అస్సాం రైఫిల్స్, బోర్డర్స్ సెక్యూరిటీ ఫోర్స్ , సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు, స్టాంగ్ రూమ్‌లను బద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇతర రాష్టాలనుంచి హోంగార్డు సిబ్బంది వచ్చారు.

## కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణకు ఈసీ ఆదేశం




**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ ఎన్నికల ప్రచారం చివరి రోజున బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి చేసిన భావోద్వేగ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హుజూరాబాద్ ఎన్నికల అధికారులను ఆదేశించింది. మంగళవారం జరిగిన ప్రచారంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ 'ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపిస్తే జైత్రయాత్ర.. ఓడితే శవయాత్ర నేను ఏ యాత్ర చేయాలో మీరే నిర్ణయించుకోండి' అంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఈసీ నివేదిక కోరింది.

## తెలంగాణలో ఓటేసిన వారు ఏపీలో వేయరాదు
### ఒకరికి ఒకే చోట ఓటుండేలా చూడాలి
### 16 లక్షల మందికి రెండు చోట్లా ఓట్లు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఒక వ్యక్తికి ఒకేచోట ఓటు ఉండాలనేది వైసీపీ సిద్ధాంతమని, లక్షల మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని, ఇలాంటి వాటిని సరిచేయాలని ఎన్నికల కమిషన్‌ను కలిసామని మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనాను వైసీపీ నేతలు కలిశారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఓటు వేసిన వారు ఏపీలోనూ ఓటు వేసే అవకాశం ఉందని, అక్కడ ఓటు వేసిన తర్వాత రద్దు చేసుకుని ఏపీలో ఓటు వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎలాగూ ఓడిపోతారనే ఉద్దేశంతో ఎన్నికలకు ముందే టీడీపీ తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని, ఆ పార్టీ చేవలేని పార్టీలా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో నారా లోకేష్ ను ఉరికిస్తామని, 50రోజులు ఢిల్లీకి పారిపోయిన ఆయన సీఎంను భయపెడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నవారు 16లక్షల వరకు ఉన్నారని, అలాంటి వారిని ఒకే చోటకు పరిమితం చేయాలన్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారు ఏపీలో వేయకుండా చూడాలని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఈసీకి ఫిర్యాదు చేశామని మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఈసీని కలిసిన వారిలో మంత్రులు జోగి రమేష్, మేరుగా నాగార్జున, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్ల అంశం, రెండు రాష్టాల్లో ఓటు ఉండటంపై ఫిర్యాదు చేశారు. రెండు తెలుగు రాష్టాల్లో ఓట్లు ఉన్నవారు 16లక్షల వరకూ ఉన్నారని మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. రెండుచోట్ల ఓటు ఉన్న వారిని ఒకే చోటకు పరిమితం చేయాలన్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారు ఏపీలో వేయకుండా చూడాలన్నారు. అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఈసీకి ఫిర్యాదు చేశామని మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకేచోట ఓటు ఉండాలనేది వైసీపీ సిద్ధాంతమని మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. లక్షల మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి వాటిని సరిచేయాలని ఎన్నికల కమిషన్‌ను కలిశామన్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారికి ఏపీలోనూ ఓటు వేసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఓటు వేసిన తర్వాత అక్కడ రద్దు చేసుకుని ఇక్కడ ఓటు వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

## ఈసీ ఆదేశాలు బేఖాతర్
### సెలవులు ఇవ్వని సంస్థలు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా నవంబర్ 30న గురువారం ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలకు, ప్రైవేటు సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈసీ సెలవు ప్రకటించినప్పటికీ పలు సంస్థలు, కళాశాలలు పట్టించుకోని పరిస్థితి. ఈ క్రమంలో రేపు సెలవు ఇవ్వడం లేదని ఎలక్షన్ కమిషన్‌కు అనేక ఫిర్యాదులు వచ్చి చేరాయి. దాదాపు 1950కు పైగా పలు ప్రైవేట్ సంస్థలు, కళాశాలల నుంచి వరుస ఫిర్యాదులు వచ్చాయి. స్థానిక అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సెలవు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో తమ ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఈసీ హెచ్చరికలు జారీ చేసింది.



# డబుల్ ఇస్మార్ట్ లుక్స్ అదుర్స్

టాలీవుడ్ ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం ఇస్మార్ట్ శంకర్. ఈ చిత్రానికి సీక్వెల్‌గా హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రం డబుల్ ఇస్మార్ట్ . ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ బ్యానర్ నిర్మిస్తోంది. థియేటర్లలో ఉస్తాద్ రామ్, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ డబుల్ మాస్ మ్యాడ్‌నెస్‌ను ఎక్స్‌పీరియన్స్ చేసేందుకు కౌంట్‌డౌన్ షురూ అయింది. మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ.. కొత్త పోస్టర్ విడుదల చేశారు. రామ్ స్టైలిష్ గాగుల్స్ పెట్టుకొని గన్స్ మధ్య స్టైలిష్‌గా డబుల్ ఇస్మార్ట్ లుక్‌ను విడుదల చేయగా.. నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. వంద రోజుల్లో థియేటర్లలో సందడి అంటూ లాంఛ్ చేసిన లుక్ వైరల్ అవుతోంది. డబుల్ ఇస్మార్ట్‌లో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన మెలోడీ బ్రహ్మ మణిశర్మ సీక్వెల్‌కు కూడా పనిచేస్తున్నట్టు .. పూరీ, మణిశర్మ, చార్మీతో కలిసి దిగిన ఫొటోను షేర్ చేస్తూ ఈ విషయాన్ని తెలియజేశాడు రామ్. ఇసార్ట్ శంకర్‌ను మించిన ఆల్బమ్ రెడీ అవుతుందని ఈ స్టిల్‌తో క్లారిటీ ఇచ్చేశాడు. ఇస్మార్ట్ ఈజ్ బ్యాక్.. ఈ సారి డబుల్ ఇంపాక్ట్.. అంటూ ఇప్పటికే శక్తిమంతమైన త్రిశూలం.. బ్యాక్ డ్రాప్‌లో మంటలు కనిపిస్తున్న లుక్‌ను విడుదల చేయగా.. ఈ సారి డబుల్ ఎంటర్‌టైన్ మెంట్ పక్కా అని చెప్పేస్తున్నాడు పూరీ జగన్నాథ్. రామ్ మరోవైపు పాపులర్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో కూడా ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ఈ చిత్రాన్ని సప్త సాగరాలు ధాటి ఫేం రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా మెరువబోతుందని వార్తలు వస్తుండగా.. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.





## ఆ క్షణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా..

### మనసులో మాట బయటపెట్టిన కృతిసనన్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ ఈ ఏడాది 'ఆదిపురుష్' మూవీ తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వంలో రామాయణం ఆధారంగా తెరకెక్కిన సినిమా ఫ్లాప్ అయినా ఇందులో సీత పాత్రలో కృతి సనన్ నటన ఆడియన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంది. ఇక ఇటీవల ఈ ఏడాది ఉత్తమ నటిగా నేషనల్ అవార్డు అందుకొని అందరి దృష్టిని ఆకర్షించింది. ఇదే వేడుకలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో కలిసి కృతి సనన్ దిగిన ఫోటో అప్పట్లో నెట్టింట తెగ వైరల్‌గా మారింది. అదే సమయంలో తనకు బన్నీతో కలిసి నటించాలని ఉందని కూడా చెప్పింది. తాజాగా ఇదే విషయంపై మరోసారి స్పందిస్తూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది కృతి సనన్. 'అల్లు అర్జున్‌ను మొదటిసారి జాతీయ అవార్డుల వేడుకలో ప్రత్యక్షంగా చూశాను. అప్పుడు మేమిద్దరం ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. ఆయన అద్భుతమైన నటుడు. తన నటనకి నేను అభిమానిని. చాలా తెలివైన వ్యక్తి. బన్నీతో కలిసి పనిచేసే క్షణం కోసం ఎంతో ఆసక్తి ఎదురు చూస్తున్నా. ఎవరైనా దర్శకుడు మా ఇద్దరితో సినిమా తీయాలని ఆశిస్తున్నా. ఇది త్వరగా జరగాలని కోరుకుంటున్నా' అంటూ మరోసారి తన మనసులో కోరికను బయట పెట్టింది కృతి సనన్. బన్నీతో కలిసి నటించాలని ఉందని ఈ హీరోయిన్ చెప్పడం ఇది మొదటిసారి కాదు. తనకు నేషనల్ అవార్డు వచ్చిన సందర్భంగా అభినందిస్తూ బన్నీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టగా దానికి ఆమె స్పందిస్తూ.. 'మీతో కలిసి నటించాలని ఉంది' అంటూ రిప్లై ఇచ్చింది. అలా సందర్భం వచ్చిన ప్రతిసారి బన్నీతో కలిసి నటించాలని ఉందని చెప్పడం ఫ్యాన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. దీంతో కృతి సనన్ కామెంట్స్‌కి ఏకీభవిస్తూ ఫ్యాన్స్ సైతం మీకు కచ్చితంగా బన్నీతో నటించే ఛాన్స్ వస్తుందంటూ సోషల్ మీడియా వేదికగా తమ ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఇదిలా ఉంటే కృతి సనన్ ఈమధ్య నిర్మాతగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాను నిర్మాతగా తీస్తున్న ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ.. 'మహిళా ప్రాధాన్యం ఉన్న సినిమాలను తీయాలనుకుంటున్నాను. ప్రస్తుతం నిర్మిస్తున్న 'దో పత్తి' అనే సినిమా సవాళ్లతో కూడుకుంది. ఇంత గొప్ప ప్రాజెక్ట్ కి నిర్మాతగా వ్యవహరించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా' అని చెప్పుకొచ్చింది కృతి సనన్.



## వార్ ప్రాజెక్టులో..

బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ బ్యానర్‌లో తెరకెక్కిస్తున్న చిత్రం వార్ 2. హృతిక్ రోషన్ , టైగర్ ష్రాఫ్ కాంబోలో వచ్చిన వార్‌కు కొనసాగింపుగా వస్తున్న ఈ ప్రాజెక్టులో జూనియర్ ఎన్టీఆర్ జాయిన్ కావడంతో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇటీవలే వార్ 2 షూటింగ్ స్పెయిన్‌లో నిర్వహించినట్టు అప్‌డేట్ వచ్చింది. ఈ షెడ్యూల్‌లో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించిన స్టిల్స్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే దానిపై క్లారిటీ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రాన్ని 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్ 3 సినిమాల తర్వాత వస్తున్న ఆరో ప్రాజెక్టు కావడం విశేషం. ఇప్పటివరకు వచ్చిన సినిమాలన్నింటి బాక్సాఫీస్ వద్ద మోత మోగించాయి. టైగర్ 3 ఎండింగ్‌లో వార్ 2 గ్లింప్స్ కూడా ప్లే చేయగా.. ప్రేక్షకులు థ్రిల్‌కు గురవుతున్నారు.

## ఓటిటిలోకి వస్తున్న కీడాకోలా




ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు మరో కొత్త సినిమా సిద్ధమైంది. నవంబర్ 3న థియేటర్లలో విడుదలై మిక్స్ డ్ టాక్ తెచ్చుకున్న కీడా కోలా సినిమా ఓటీటీ విడుదలకు రెడీ అయింది. చైతన్య రావు, బ్రహ్మానందం, తరుణ్ బాస్కర్, ప్రధాన పాత్రల్లో నటించగా తరుణ్ భాస్కరే నిర్మాతగా, దర్శకుడిగా వ్యవహరించాడు. క్రైం, కామెడీ జోనర్లో వచ్చిన ఈ సినిమాలో కామెడీ టైమింగ్ బాగానే వర్కౌట్ అయినా ఎందుకనో 'ఈ నగరానికి ఏమైంది' సినిమా స్థాయిలో జనాలకు కనెక్ట్ కాలేకపోయింది. తక్కువ బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లకు వరకు కలెక్ట్ చేసి పర్వాలేదనిపించింది. అయితే సినిమా విడుదలై 4 వారాలు కావస్తుండడంతో చిత్రాన్ని డిసెంబర్ రెండో వారంలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు తీసుకు వస్తున్నట్లు సోషల్ మీడియాలో న్యూస్ బాగా వైరల్ అవుతున్నది.

బుధవారం 29, నవంబర్ 2023
www.warangalvoice.net

# యువత ఎటువైపు..?

## ఉమ్మడి జిల్లాల్లో 50శాతం ఓట్లు వారివే
## వంద శాతం పోలింగ్ కు అధికారుల కసరత్తు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు నువ్వా..నేనా అన్నట్లుగా సాగుతున్నాయి. అధికార బీఆర్ ఎస్ పార్టీతోపాటు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. బీఆర్ ఎస్ హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తుండగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎలాగైనా తెలంగాణలో పాగా వేయాలన్న తలంపుతో పావులు కదుపుతున్నారు. అయితే కేసీఆర్ సర్కార్ మాత్రం సంక్షేమ పథకాలనే నమ్ముకోగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలుమాత్రం యువతపైనే ఫోకస్ పెట్టాయి. అయితే నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నియామకాలు ఉత్తమాటగానే మిగిలిపోయింది. దీంతో యువత మార్పు కోరుకుంటున్నట్లు సోషల్ మీడియా సాక్షిగా ప్రచారం సాగుతోంది.

### 50శాతం యువతే..

అన్ని పార్టీలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెబుతూ యువ, నవ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే యువతను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 29,74,631 మంది ఓటర్లుండగా ఇందులో 50శాతం యువతే కావడం గమనార్హం. 18 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు మొత్తం 14,70,458 మంది ఉన్నారు. ఇందులో 18నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్కులు 7,05,286 ఉండగా, 30నుంచి 39 సంవత్సరాల మధ్య వయస్కులు 7,65,172 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో యువ, నవ ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారన్న చర్చ రాజకీయ విశ్లేషకుల్లో సాగుతుండగా.. ఆ ఓటర్లను ఆకట్టుకోవడంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి.

### యువతే కీలకం..

ఉమ్మడి జిల్లాలో యువత అధికంగా ఉండడంతో యువచైతన్యం వెల్లివిరుస్తోంది. ఎన్నికల్లో వీరే కీలకంగా మారనున్నారు. అత్యధిక శాతం ఉన్న ఈ ఓటర్లు ఏ పార్టీవైపు మొగ్గు చూపుతారన్న అంశం కీలకంగా మారింది. ఓ వైపు రాజకీయ విశ్లేషకుల్లో ఇదే చర్చ జరుగుతుండగా.. ప్రధాన రాజకీయ పార్టీలు సైతం వారి ఓట్ల పైనే ఫోకస్ పెడుతున్నాయి. జిల్లాలో కేయూ, ఎస్ఐటీ, హెల్త్ యూనివర్సిటీ, వెటర్నరీ, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ డిగ్రీ, వ్యవసాయ పీజీ కళాశాలలు, పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఒకేషనల్ కళాశాలలున్నాయి. అదే విదంగా నిరుద్యోగ యువత కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. అయితే ఈ ఎన్నికల ద్వారా యువగళం వినిపించేందుకు వారు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

### వంద శాతం పోలింగ్..

కొత్త ఓటర్ల నమోదుతోపాటు వంద శాతం పోలింగ్ జరిపించేలా అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం పెద్ద ఎత్తున ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారానూ ఓటు నమోదు, ఓటు వేయడం, పోలింగ్, పార్టీల పాత్ర తదితర అంశాలపై పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. అయితే యువత పెద్ద ఎత్తున పోలింగ్ లో పాల్గొంటే అది ఎవరికి కలిసి వస్తుందన్న చర్చ ముమ్మరంగా సాగుతోంది. మారు మూకుమ్మడిగా ఎవరికి ఓటు వేస్తారన్న ఆందోళన నెలకొంది. వారి ఓట్లే కీలకంగా మారనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.

# స్వేచ్ఛగా ఓటేయాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య కోరారు. ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె పేర్కొన్నారు. బుధవారం ఏనుమాముల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డీఆర్ సీ కేంద్రాల ద్వారా వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజక వర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు, నర్సంపేట నియోజక వర్గానికి సంబందించిన పోలింగ్ మెటీరియల్ ను నర్సంపేట మార్కెట్ యార్డ్ డీఆర్ సీ సెంటర్ ద్వారా తరలించినట్లు ఆమె ప్రకటించారు. పోలీస్ భద్రత వాహనాలలో ఈవీఎంలతో సెక్టోరల్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరారన్నారు.

### 791 పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 791 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. మూడు నియోజకవర్గాల్లో మొత్తం 7,56,608 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 161 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ తో పాటు అధిక భద్రత సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. 1,506 మైక్రో అబ్జర్వర్లను, 963 పోలింగ్ ఆఫీసర్లు, 959 సహాయ పోలింగ్ అధికారులు, 1,929 ఇతర పోలింగ్ సిబ్బంది ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు నియోజకవర్గాలకు 1,629 బ్యాలెట్ యూనిట్లు 987, కంట్రోల్ యూనిట్లు, 1,107 వివి ప్యాట్లు కేటాయించి కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు.

### 15 మహిళా పోలింగ్ కేంద్రాలు..

వరంగల్ జిల్లా పరిధిలో 15 మహిళ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రావీణ్య ప్రకటించారు. వీటిని పూర్తిగా మహిళలే నిర్వహిస్తారన్నారు. మూడు దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలు, 15 మోడల్ పోలింగ్ కేంద్రాలు, మూడు యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీరికి సహాయార్ధంగా 18 ఏళ్ల లోపు గల 800 మంది విద్యార్థులు సేవలు అందిస్తున్నారని వివరించారు.

### పటిష్ట భద్రత..

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని ఎన్నికల అధికారి ప్రావీణ్య తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.




# తెలంగాణ ప్రజల పోరాటానికి..
# పరిష్కారం దొరికేనా?

తెలంగాణ ప్రజల చైతన్యం మరియు పోరాటం అంత కూడా నిజాం పాలన నుంచి విముక్తి కోసం, అలాగే ఆ కాలం నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన తోలి-మలి దశ ఉద్యమం వరకు తెలంగాణ అస్తిత్వ ఉద్యమాల చుట్టూ తిరుగుతూ వచ్చింది. కానీ అప్పటి నుంచి నేటి వరకు ప్రజల చైతన్యం మరియు పోరాట స్ఫూర్తిని రాజకీయ నాయకులు తమ స్వార్థానికి వాడుకోవడం, అలాగే వారి సంకుచిత ఆలోచనల వలన సబ్బండ వర్గాల సమాజ అభివృద్ధికి కృషి చేయలేదు అనేది వాస్తవ చరిత్ర. పాలకుల పాలనతో ప్రజలు కష్టాలు పడుతుంటే వారికి తోడుగా మేధావులు కలుస్తూ ఉద్యమాలు జరిగే సందర్భంలో రాజకీయ నాయకులూ కూడా ఉద్యమంలో భాగస్వామ్యం కావడంతోపాటు పోరాట ఫలితాలను అన్ని వర్గాల ప్రజలకు చేరవేసే వారినే రాజకీయ నాయకులూ అంటారు. కానీ తెలంగాణ గడ్డ దురదృష్టం ఏంటో తెలియదు కానీ ఇక్కడి ప్రజలు పోరాటాలు చెయ్యడం, రాజకీయ నాయకత్వం తమకు దిక్కుతోచని పరిస్థితులలో ఉద్యమాలలో చేరి చివరికి ఉద్యమాలనే హైజాక్ చేసి, రాజకీయం అంటే పేదోళ్లకు అందని ద్రాక్షలాగా చేస్తూ పెట్టుబడిదారులకు, భూస్వాములకు, దొరలకు, దోపిడీ దారులకు కొమ్ముకాస్తూ, వారి అనంగులను, నాయకులూగా ప్రజల మీద రుబ్బుతూ ఉద్యమ ఆశయాలను మోసే ఉద్యమ నాయకులను బలహీన పరుస్తూ, సామజిక సాధికారితను, బడుగు బలహీన వర్గాల నాయకత్వాన్ని అడ్డుతొలగించుకునే సంస్కృతిని గడిచిన 75 ఏండ్లు ఏలిన పార్టీలను మరియు వాటి నాయకుల చరిత్ర చూస్తే మనకు అవగతం అవుతుంది.



**- డాక్టర్ సదానందం**
గుల్లపెల్లి, పొలిటికల్ అండ్ సోషల్ అనలిస్ట్

నిజాం రాజు నియంతృత్వం, రజాకార్ల రాక్షసత్వం, దొరల దోపిడీల నుంచి బానిస సంకెళ్లు తెంచుకోవడం కోసం ప్రజలు సాయుధ రైతాంగ పోరాటం చేశారు. నిజాం పాలననుంచి విముక్తి తరువాత హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వ కాలంలో ప్రజల ఆశయాలు ఆవిష్కృతం కావాల్సిన సమయంలో ఊహించని అనేక అడ్డంకులు ఎదురవ్వడం జరిగింది. అందులో మొదటిది, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అసమర్ధత కారణంగా ఆంధ్ర మరియు హైదరాబాద్ రాష్ట్రములు కలిసి ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడడం. రెండవది పైజామా, షేర్వాణీ, కుచ్చుటోపీ పెట్టుకొని నిజాం రాజు అడుగులకు మడుగులు వొత్తిన దొరలూ, దేశముఖ్ లు, భూస్వాములు గాంధీ టోపీ పెట్టుకొని కాంగ్రెస్ పార్టీలోకి పోయి అప్పటి పార్టీ నాయకత్వంకు తెలంగాణ ప్రజల ఆశ, ఆశయం, అస్తిత్వం తెల్వకుండా చేయడం. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత అయినా కూడా పై అడ్డంకులను అధిగమించి సబ్బండ వర్గాల ప్రజలకు చేరువకావాల్సిన కాంగ్రెస్ పార్టీ నాయకుల రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణ ప్రాంత నాయకులకు పదవులలో అన్యాయం జరగడం, నీళ్ల పేరిట, నిధుల పేరిట తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతుంటే, తెలంగాణ ప్రజల ఆశయం కోసం మళ్ళీ ప్రజలు జై తెలంగాణ అంటూ ప్రత్యేక రాష్ట్రము కోసం 1969 లో తోలి దశ ఉద్యమం ఉవ్వెత్తున లేసింది, ఉద్యమంలో ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. తదనంతర 1971 ఎన్నోకల్లో తెలంగాణ ఏర్పాటు కోసం తెలంగాణ ప్రజా సమితి పార్టీకి పట్టం కట్టారు కానీ చివరికి కొందరు నేతలు అధికార యావలో పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసారు, తద్వారా ముఖ్యమంత్రి, గవర్నర్ కొలువులు మాత్రం సంపాదించారు కానీ తెలంగాణ ప్రజల ఆశ, ఆశయాలను మాత్రం ఆవిరి అయిపోయినవి. తోలి దశ ఉద్యమానికి ముందు గాని తరువాత సమయంలో రెండు దఫాలుగా ముఖ్యమంత్రి రేసులో ముందు ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ గారు ముఖ్యమంత్రి అయ్యి ఉంటే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర మరోలా ఉండేది, అలంటి వ్యక్తి ఉద్యమం కోసం మంత్రి పదవిని కూడా రాజీనామ చేసి చరిత్రకెక్కారు. అలాగే అప్పట్లో సి.జగన్నాధ రావు లాంటి బిసి నాయకులు కూడా ముఖ్యమంత్రి కాకుండా కాంగ్రెస్ పార్టీ అనేక కుట్రలు చేసింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కాంగ్రెస్ మరియు టీడీపీ పార్టీలు అధికారంలో ఉన్నాకూడా అన్ని వర్గాలకు చేరువ అవడంలో వైఫల్యం అయినవి. ఎందుకంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రెడ్డి నుండి తొమ్మిది, కమ్మ నుండి ముగ్గురు, వెలమ, వైశ్య, బ్రాహ్మణా కులాల నుండి ఒక్కక్కరు ముఖ్యమంత్రులు అయ్యారు. 75శాతం పైబడి ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలనుండి కేవలం దళిత నాయకుడు దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి అయ్యారు కాని జనాభాలో 50శాతం పైబడి ఉన్న బీసీ సమాజం నుండి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అంటే కాంగ్రెస్, టీడీపీలు నిబద్దత అణగారిన వర్గాల పట్ల ఎంత ఉందో అర్ధం అవుతుంది. 50శాతం పైబడి ఉన్న బీసీ సమాజం నుండి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వకుండా ఈ పార్టీలు వివక్ష చూపాయి. ఈ వివక్ష మరియు నీళ్లు, నిధులు, నియామకాలు లాంటి సమస్యలు కారణంగానే ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమం మొదలయింది. మలిదశ ఉద్యమం మొదట్లో తెలంగాణ రాష్ట్రం కోసం తెరాస పార్టీ కేసీఆర్ అధ్యక్షుడిగా ప్రజల్లో అంత వేగంగా పోకపోవడానికి నాయకత్వ సామజిక కోణం కూడా ఒక కారణం. దీనిని అధిగమించడం కోసం అలె నరేంద్ర స్థాపించిన పార్టీని తెరాసలో విలీనం చేయడం, తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తాం అని చెప్పడంతో జాతీయవాదులతో పాటు పేద వర్గాల ప్రజలు తెరాస పార్టీని నమ్మే పరిస్థితి వచ్చి ఉద్యమం ఉవ్వెత్తున లేసింది. తదనంతర ఉద్యమంలో వందలాది మంది ప్రాణత్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని 2014 లో సాధించుకోవడం జరిగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com